
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజా జ్యోతి
ప్రతిఅక్షరం - ప్రజల కోసం
ఖమ్మం
బుధవారం 17 జూలై 2024



- ప్రతి పనికీ ఇష్టారాజ్యంగా వసూళ్లు
- డేట్ ఆఫ్ బర్త్ మార్పిడికి రూ.3 వేలు పైనే..
- నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడిందే పాట
- అటువైపు కన్నెత్తి కూడా చూడని అధికారులు
- 'తెలంగాణ' మార్పును ఉచితంగా అందించాలంటున్న ప్రజలు




# ఆధార్ సెంటర్లలో అడ్డగోలు దోపిడీ!

**రఘునాథపాలెం**

ఆధార్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని దోపిడీకి తెగబడుతున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఏ సర్వీస్‌కు ఎంత? అనే బోర్డులు ఆధార్ సెంటర్లలో ఎక్కడా కనిపించవు.. దీంతో ఇష్టారాజ్యంగా అందినకాడికి దోచుకుంటున్నారు. అవసరం కావడంతో ప్రజలూ అడిగినంత ఇచ్చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి పథకానికీ ఆధార్ కార్డు తప్పనిసరి. అయితే ఆధార్ కార్డు జారీ ప్రక్రియ సామాన్య ప్రజలకు కష్టాలను తెచ్చిపెడుతున్నది. సులభతరంగా అందించాల్సిన సేవలకు ఆధార్ సెంటర్ నిర్వాహకులు 'రేట్' ఫిక్స్ చేసి మరీ దండుకుంటున్నారు. ఆధార్ సేవలకై కేంద్రాలను ఆశ్రయిస్తే నిర్వాహకుల చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడిగినంత ఇచ్చుకోకుంటే రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఆధార్ కార్డుల -మిగతా6లో

# బిజెపి లక్ష్యం భారత రాజ్యాంగాన్ని మార్చటం

- బిజెపిని ఓడించడమే సిపిఎం ప్రధాన లక్ష్యం
- రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆశించిన స్థాయిలో లేదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బిజెపి అత్యధిక ఎంపీ స్థానాలు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మార్చటమే లక్ష్యంగా పెట్టుకుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మధిర మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో శ్రీరస్తు ఫంక్షన్ హాలు నందు సిపిఎం జిల్లాస్థాయి ప్లీనరీ సమావేశం మంగళవారం జరిగింది. -6లో

# అత్యద్భుతంగా స్వ"రూపమే" చెక్కుతారు

ఖమ్మం ప్రతినిది, జూలై 16 ప్రజా జ్యోతి

వారు స్వరూపము, విగ్రహము, బొమ్మలు తయారు చేస్తే శిల్పం చెక్కినట్లే ఉంటుంది. ఆధునిక టెక్నాలజీతో పాటు నవ, యువ తరంగా ఉండేవిధంగా నైపుణ్యత కలిగిన వారిచే బొమ్మలు తయారు చేయిస్తారు. వారుచేసిన బొమ్మలు అచ్చుగుద్దినట్లు రూపమే ఉంటున్నట్లుగా కనిపిస్తుంది. అంతా అత్యాధునిక టెక్నాలజీ కలిగిన విగ్రహాల తయారీ కేంద్రం ఖమ్మంజిల్లా తల్లాడ మండలం మంగాపురం అడ్డరోడ్ లో ఆంటోని రెడ్డి ఆర్ట్ స్టూడియో పేరుతో బొమ్మల కంపెనీ ఏర్పాటు చేశారు. -3లో



## బ్లీచింగ్ పౌడర్ చల్లించిన మాజీ సర్పంచ్ సక్రం నాయక్



కారేపల్లి జూలై 16 ప్రజా జ్యోతి:సింగరేణి మండలం గేటు రేలకా యల పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డులలో మాజీ సర్పంచ్ బానోత్ సక్రం నాయక్ ,మాజీ ఉప సర్పంచ్ ఈసాల సందీప్ లు మంగళవారం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షా కాలంలో ప్రజలకు డెంగ్యూ, మలేరియా, విషజ్వరలు, అంటు వ్యాధులు రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నట్లు అయన తెలిపా రు. ఈ కార్యక్రమంలో గణితి రామారావు, ఈసాల సందీప్, శంకర్, సురేష్, కేలోత్ బన్సీలాల్ , పూనెం శంకర్, పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో నూతన విద్యా బోధన

**ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి**




సత్తుపల్లి జూలై 16 (ప్రజా జ్యోతి): అంగన్వాడీ కేంద్రాలలో నూతన విద్యా విధానం ద్వారా బోధన జరుగుతుందని రెండు సంవత్సరములు నిండిన చిన్నారులను అంగనవాడి కేంద్రానికి పంపించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ కల్లూరు సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు.కల్లూరు మండల పరిధిలోని పుల్లయ్య బంజర్ అంగన్వాడి టు కేంద్రంలో మంగళవారం టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో సంధ్యారాణి మాట్లాడుతూ 2024- 25 విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రంలో నవీకరించిన పూర్వ విద్య సిలబస్ తో రూపొందించిన విధానంలో బోధనకు శ్రీకారం చుట్టామన్నారు.చిన్నారులకు క్రమశిక్షణతో కలిగిన నూతన విద్యా విధానంతో పాటు వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాల్లో బోధన ఉంటుందని,తల్లులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పుల్లయ్య బంజర్ వన్ కేంద్రం టీచర్ శ్రీలక్ష్మి,లోకవరం టీచర్ లక్ష్మి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకునేటితో పరిష్కారం

**మైనార్టీ నాయకులు గౌసూద్దీన్**

కారేపల్లి జులై 16 ప్రజా జ్యోతి:



సింగరేణి మండల కేంద్ర ంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని,డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారనే సమస్యలను ఎస్కే గౌసుద్దీన్ గత సోమవారం రోజు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ అధికారులను ఆదేశించడంతో మంగళవారం కారేపల్లి గణేష్ సెంటర్ లో డ్రైనేజీ పూడిక నిర్మాణం చేపట్టారు. మురుగునీరుతో పూర్తిగా నిండిన డ్రైనేజీని జెసిబి సాయంతో మట్టిని తొలగించి,మురుగునీరు ప్రవాహానికి అంతరాయం లేకుండా చేశారు. త్వరితగతిన స్పందించి డ్రైనేజీ పనులు చేపట్టేలా చేసిన కలెక్టర్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతూ,ఏదో రకంగా తమను ఆదుకుంటున్నారని,కాలనీ ప్రజల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి,సమస్యలను పరిష్కరించేలా చేసిన గౌసిద్దీన్ కు స్థానికులు అభినందనలు తెలిపారు.

## పిక్లి భౌతిక కాయానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే, మండల నాయకులు






కారేపల్లి జూలై 16 ప్రజా జ్యోతి : సింగరేణి మండల పరిధిలోని పోలంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జర్పుల ధోనీ నాయక్ తల్లి పిక్లీ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వైరా తాజా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ మంగళవారం పిక్లి భౌతికకాయాన్ని సందర్శించి , పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ లు గుగులోత్ సక్కు, మాళోత్ కిషోర్, ధారావత్ భద్రు, నాయకులు ధరవత్ సక్కు, అజ్మీర వీరన్న, గుగులోత్ తేజ్యా నాయక్, అజ్మీర శివ నాయక్, గుగులోత్ భగవాన్ దాస్, గుగులోత్ నారాయణ, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. నివాళులర్పించిన కాంగ్రెస్ మండల నాయకులు పిక్లి పార్థివదేహానికి నివాళ్ళు అర్పించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ PCC ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ లు అడ్డగోడ ఐలయ్య, బానోత్ హీరోలాల్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ దాసరి ఐలయ్య, మాజీ సర్పంచ్ దారావత్ బద్రు నాయక్, ఉసిరికాయలపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచబండి నాగేశ్వరరావు , మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ మేదరి వీర ప్రతాప్ (టోని) తాజుద్దీన్, మాజీ ఉప సర్పంచ్ కొమ్ము వెంకన్న, గూగులోత్ భీముడు, బోడ రవి, పచ్చిపాల వెంకట్, గొల్ల మందల రాములు , లాకావత్ రాజేష్, మూడ్ బాలు, చోహన్, బోడ హర్జయ, బోడ బద్రు, గొల్లమందల సతీష్, గొల్లమందల ప్రశాంత్, ధరావత్ సక్రు, దరవత్ రమేష్, తోగర శ్రీను తదితరులు ఆమె భౌతిక గాయానికి నివాళులర్పించారు.

## బెటాలియన్ కమాండెంట్ గా చటర్జీ.



సత్తుపల్లి జులై16 ప్రజా జ్యోతి ఆర్. సి మండల పరిధిలోని గంగారం 15వ బెటాలియన్ లో నూతన కమాండెంట్ గా పి. జె. పి. సి చటర్జీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చటర్జీ బెటాలియన్ కు రావడం జరిగిందన్నారు.బెటాలియన్ అదనపు కమాండెంట్ వెంకట్ రాములు ఆయనకు సాధారణంగా ఆహ్వానం పలికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పలువురు విధులు నిర్వహిస్తున్న వారిని కమాండెంట్ కు పరిచయ కార్యక్రమాలు చేసినారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతి ఎస్ డి రంగా రెడ్డి బెటాలియన్ సిబ్బంది ఉన్నారు.

## విద్యా చరిత్రకు నిలువుటద్దం కరేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల

**ప్రిన్సిపాల్ సింహాచలం**

కారేపల్లి జులై 16 ప్రజాజ్యోతి:సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల 4 దశాబ్దాల విద్యా చరిత్రకు నిలువుటద్దం అని కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1982వ సంవత్సరంలో ప్రారంభించిన కాలేజీ నేటికీ తరగని విలువలతో ఇంటర్మీడియట్ విద్యకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. ప్రైవేటు,ఇతర కళాశాలలు లేని నాటి రోజులలో అందరూ ఇక్కడే ఇంటర్ విద్య చదువుకున్నారు. ఇక్కడి విద్యార్థులు ప్రముఖ వ్యక్తులుగా, ఉన్నతోద్యోకులుగాదేశ,విదేశాల్లో స్థిరపడ్డారు. ఇంతటి ఘనకీర్తి కలిగిన కళాశాల ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో,ఆధునిక విద్యార్థు



ల,ఉద్యోగ,ఉన్నత విద్యలకు బాసటగా ఇంజనీరింగ్,ఎన్ఐటి,బి ఫార్మసీ,బిఎస్సీ నర్సింగ్ వంటి కోర్సులలో విద్యార్థులకు సీట్లు సాధిస్తూ విద్యార్థులకు ఉన్నత విద్యలకు బాసటగా నిలిచిందని పేర్కొన్నారు.ఉపాధి ప్రాధాన్యత కలిగిన,త్వరగా ఉపాధి పొందే వృత్తి విద్య కోర్సులు మెకానికల్ ఇంజనీరింగ్,నర్సింగ్, కంప్యూటర్ అకౌంట్స్ బోధించే ఉపాధి అవకాశాలు విద్యార్థులు పొందుతున్నారు .సింగరేణి మండల విద్యార్థులే కాకుండా,కూసుమంచి ,రఘునాథ పాలెం, టేకులపల్లి,కామేపల్లి, ఖమ్మంరూరల్ విద్యార్థులు కూడా మా కళాశాలలో అడ్మిషన్ పొందుతున్నారు.ప్రస్తుతం 350 మంది విద్యార్థు ఉన్నప్పటికీ ఇంకా అడ్మిషన్లు పొందుతున్నారు.బాలబాలికలకు వేరువేరుగా హాస్టల్ వసతి కలదు.నేటి విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కళాశాలలో సింగరేణి డోలమైట్ స్టీల్ ప్లాంట్ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో బిల్డింగ్ మొత్తానికి రంగులు వేసి ఆదర్శంగా తీర్చిదిద్దాము, కొందరి ప్రముఖుల ఆర్థిక సహాయంతో కాలేజీకి అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు పరీక్షల టైములో ఉపయోగపడే మెటీరియల్స్ ను విద్యార్థులకు అందించాము. నేటి ఉన్నత విద్య ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులను సమున్నతంగా తీర్చాదిద్దుతున్న అద్యాపక సిబ్బంది కృషి ప్రశంసనీయమని ఆయన అన్నారు.

## అందుబాటులోకి ఏకలవ్య గురుకుల విద్యాలయం

**ఈ విద్యా సంవత్సరమే ప్రారంభించండి**
**ఎంపీపీ మాలోత్ శకుంతల**

కారేపల్లి జులై 16 ప్రజాజ్యోతి: సింగరేణి మండలం రేలకాయలపల్లి పంచాయతీ పరిధిలో గల తవిసబోడు గ్రామ సమీపంలో ఏకలవ్య గురుకుల విద్యాలయం నిర్మాణం పూర్తి చేసుకొని విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని సింగరేణి ఎంపీపీ మాలోత్ శకుంతల అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం ఏకలవ్య గురుకుల విద్యాలయం తనికెళ్ల సమీపంలో లక్ష్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణం యందు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అయితే అక్కడ విద్యార్థులకు చాలా



ఇబ్బందికరంగా మారిందని ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరైన వసతులు లేకపోవడంతో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఏకలవ్య గురుకుల విద్యాలయంలో మైనర్ పనులు మినహా తరగతి గదులు, విద్యుత్తు, రహదారులు పూర్తయ్యాయని విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు . రెండు సంవత్సరాల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించిన ఏకలవ్య గురుకుల విద్యాలయం 35 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తయింది అన్నారు. ఈనెల 20వ తేదీన వరకు సంబంధిత కాంట్రాక్టర్ బిల్డింగ్ను అప్పగించనున్నట్టు తెలిపారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఈ విద్యా సంవత్సరంలో ఏకలవ్య గురుకుల విద్యాలయంలో తరగతులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# కార్యదర్శికి బాధ్యత లేదా...!





కల్లూరు జూలై 16(ప్రజా జ్యోతి):మండల పరిధిలో లి ంగాల కాలనీలోనడిరోడ్డుపైనే పారిశుద్ధం పరుగులు తీస్తోం ది అయినా చలనం లేని అధికారులు.గత సర్పంచుల కాలములో సమస్యలు ఉన్న పట్టించుకోలేదు,అధికారులు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బాధ్యత లేకుండా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.నడవడానికి వీలు లేకుండా మురుగునీరు రోడ్డపై ప్రవహిస్తుంటే దుర్గంధం వెదజల్లుతుంది.పిల్లలు అనారోగ్యం పాలైన పరిస్థితులు కనపడతున్న కనికరం లేని అధికారులు తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి పరిష్కరించాలని కోరుతున్నారు.

# జిల్లా హిందూ వాహిని సంఘటన్ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కల్లెం విజయ రెడ్డి



ఖమ్మం టౌన్, జూలై 16 ప్రజా జ్యోతి: జిల్లా హిందూ వాహిని సంఘటన్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా కల్లెం విజయ రెడ్డి నియమితులయ్యారు . ఈ మేరకు హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర అధ్యక్షురాలు మద్దూరు భార్గవ రెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లెం విజయ రెడ్డి మాట్లాడుతూ తనపై పూర్తి నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మిస్ట్ లో ఎంప్లాయ్ బులిటీ ట్రైనింగ్.



సత్తుపల్లి జులై16 ప్రజా జ్యోతి ఆర్. సి : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మదర్ తెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీ నందు ప్రముఖ ఐటీ సంస్థ లైన కాగ్నిజెంట్, ఆక్సెంచర్, ఐ బి ఎం సంస్థలతో ,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ఉద్యోగ సాధనకు అవసరమైన, నైపుణ్యమైన శిక్షణ కార్యక్రమాన్ని మార్ఫ్ స్కిల్ ల్యాబ్ హైదరాబాద్ వారితో గత 20 రోజుల నుంచి శిక్షణ తరగతులు నిర్వహించబడుచున్నవి. మార్ఫ్ సంస్థ డైరెక్టర్ మహేష్ కుమార్, ఆపరేషన్ మేనేజర్ మనోజ్ ,తెలుగు రాష్ట్రాల సుపరిచితులైన ట్రైనర్స్ ప్రవీణ్ కుమార్, జోహార్ బాబు, ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విద్యార్థిని విద్యార్థులకు టిసిఎస్ ఎంక్యూటీ పరీక్షకు అవసరమైన శిక్షణను అందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చలసాని సాంబశివరావు మాట్లాడుతూ 20 రోజులు శిక్షణ తీసుకున్న, ఉత్సాహవంతులైన విద్యార్థులకు మెమెంటోళ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఈలాంటి శిక్షణ విద్యార్థులకు చాలా అవసరమని, దీని వలన విద్యార్థులు ప్రైవేటు, ప్రభుత్వ రంగాలలో స్థిరపడటానికి మెండుగా అవకాశాలు ఉన్నాయని, పుస్తక పఠనంతో పాటు ప్రాక్టికల్స్ కూడా చాలా దోహదపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ షాకీర్ హుస్సేన్, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వి రామచంద్రరావు, ప్లేస్మెంట్స్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్ టి. రాఘవ రాజు వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిడ్డంగులను రైతులకు అందుబాటులోకి తెస్తా : రాయల

చైర్మన్ హోదాలో తొలిసారిగా రాయల నాగేశ్వర్ రావు ఖమ్మం రాక

ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

పైనంపల్లి నుంచి ఖమ్మం వరకు భారీ ర్యాలీ



ఖమ్మం ప్రతినిధి, జూలై 16 ప్రజా జ్యోతి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ హోదాలో తొలి సారిగా ఖమ్మం వచ్చిన రాయల నాగేశ్వరరావుకు జిల్లా సరిహద్దు నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద కాంగ్రెస్ శ్రేణులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గిడ్డంగులను రైతులకు అందుబా టులోకి తీసుకొస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి నాకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్కకు జిల్లా మంత్రులకు ఆయన కృతజ్ఞత లు తెలిపారు. తాను రైతు బిడ్డగా రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. మరిన్ని నూతన గిడ్డంగులు నిర్మించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం భారీ బైక్ ర్యాలీతో నేలకొండపల్లి మీదుగా ముదిగొండ మండలం వెంకటాపురం లోని పంక్షన్ హాల్ కు చేరుకున్నారు. అక్కడ తన మాతృ మూర్తి రాయల కమలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఖమ్మం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి రెడ్డి భవన్ కు చేరుకున్న రాయల..అక్కడ కొద్దిసేపు కార్యకర్తలతో ముచ్చటించారు. అక్కడ నుంచి మామిళ్లగూడెం లోని వివిసి పంక్షన్ హాల్లో బంధు, మిత్రులు ఏర్పాటు చేసిన అభినందన సభలో రాయల పాల్గొన్నారు.

# లంకపల్లి గ్రామంలో 'అమ్మ మాట అంగన్వాడీ బాట' కార్యక్రమం



పెనుబల్లి, జులై 16 (ప్రజాజ్యోతి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అమ్మ మాట అంగన్వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెనుబల్లి మండల పరిధిలోని లంకపల్లి గ్రామంలో లంకపల్లి సర్కిల్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు అందేటటువంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రెండున్నర సంవత్సరాల నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడి స్కూల్ కి పంపించేలా వారిని తీసుకువచ్చే బాధ్యత అంగన్వాడీ టీచర్లు ఆయాలు తీసుకోవాలని సూపర్వైజర్ సుజాత అన్నారు. ఈ సందర్భంగా లంకపల్లిలో అమ్మ మాట అంగన్వాడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంకపల్లి సర్కిల్ పరిధిలోని అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు





ఖమ్మం ప్రతినిధి, జూలై 16 ప్రజా జ్యోతి: శానిటేషన్ విజిట్ లో భాగంగా మున్సి పల్ కమిషనర్ అభిషేక్ అగ స్త్య మంగళవారం 15 డివి జన్ లో పర్యటించారు. ఓపె న్ ప్లాట్స్ ఎక్కువగా ఉండటం వల్ల దోమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున వర్కర్స్ తో అది అంత శుభ్రపరచడం సాధ్యం కానందున జెసిబితో శుభ్రపరిచేలా చర్యలు తీసుకో వాలని అసిస్టెంట్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ ఆటోలు ట్రాక్టర్లు సరిగా నడుస్తున్నాయా లేదా రోజుకి ఎన్ని ట్రిప్పులు వేస్తున్నారు.. డివిజన్ రోడ్డు వైస్ రోజువారి కలెక్షన్ కి రూట్ మ్యాప్ ఎలా చేసుకున్నారని తెలుసుకున్నారు. డివిజన్ పెద్దగా ఉండటంవల్ల ట్రాక్టర్ రెండు ట్రిప్పులు వేసేలా ప్లాన్ చేసుకోవాలని సంబంధిత జవాన్ ను ఆదేశించారు. డోర్ టు డోర్ కలెక్షన్ ప్రతిరోజు జరగాలని, కీమాపాస్ట్ %౦% ఫాగింగ్ రోజు జరిగేలా చర్యలు తీసుకోవాలని, నీళ్లు పోకుండా ఆగి ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని బావుల్లో నీరు ఎక్కువ రోజుల నుండి నిలువ ఉన్నచో అందులో బ్లీచింగ్ పిచికారి చేయాలని చెప్పడం జరిగినది ఎక్కడైనా నీరు పోకుండా ఉన్న ఎడల కచ్చా కాలువలు కొట్టి ఆ నీటిని డ్రైనేజీలోకి కలిసేలా చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ కమిషనర్ ను ఆదేశించారు.

# తమ భూమి తమకు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి



కారేపల్లి జులై 16 ప్రజా జ్యోతి: సింగరేణి మండల పరిధిలోని కమలాపురం రెవెన్యూ పరిధిలో అసైన్డ్ భూమి 147 సర్వే నెంబరులో గల తమ భూమిని వేరే వారు ఆక్రమించుకున్నారని, తమ భూమిని తమకు ఇప్పించాలని కోరుతూ పాత కమలాపురం మాజీ సర్పంచ్ గుగులోత్ పద్మ మంగ్య నాయక్ ఆధ్వర్యంలో కమలాపురానికి చెందిన పలువురు రైతులు మంగళవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేరే వారు ఆక్రమించుకున్న ఆ భూమిలో, తమకు ఎప్పుడో పట్టాలు ఇచ్చారని, అయితే కొందరు ఆ భూమిని ఆక్రమించుకొని, తమను భూమి వద్దకు రానీయడం లేదని వాపోయారు. తమ భూమిని తమకు ఇప్పించాలని ఎమ్మెల్యేను తాము కోరామని, ఎమ్మెల్యే స్పందించి తమకు తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సపావట్ రమేష్ ,గుగులోత్ నాజి , భూక్యా జీవన్ ,గుగులోత్ ప్రసాద్, గుగులోత్ తిరుపతి, బాణోత్ అమ్మి, సపావట్ ద్వాలి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# రాయలకు శుభాకాంక్షలు తెలిపిన మండల కిసాన్ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి



కల్లూరు జూలై 16(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరావు ప్రమాణ స్వీకారం అయిన తరువాత ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన శుభ సందర్భంలో కల్లూరు మండల పరిధి బత్తులపల్లి గ్రామానికి చెందిన మండల కిసాన్ అధ్యక్షులు శీలం బ్రమ్మారెడ్డి మంగళవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాయలకు పుష్ప గుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా శు భాకాంక్షలు తెలుపుతూ,శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వివిధ మండల కిసాన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తమలపాకులతో సాయినాధునికి అభిషేకం



ఖమ్మం టౌన్ , జూలై 16 ప్రజా జ్యోతి: గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా నగరం లోని గాంధీచౌక్ శ్రీ వర ప్రధాత షిర్డీసాయి మందిరంలో శ్రీ అల్లం రవికుమార్ బృందం వారిచే 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణము , శ్రీ సాయినాధునికి నాగవల్లీ దళములతో ( తమలపాకులతో ) అర్చన , మన్యు పాశుపత సంక్షేప రామాయణ హోమం, అల్లం రవికుమార్ బృందం వారిచే 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణము , శ్రీశైలం వాస్తవ్యులు శ్రీ సాయి దాసు చే బాబా ప్రవచనము లు . అనంతరం సాయి హారతులు , నీరాజన మంత్ర పుష్పము , చతుర్వేదస్వస్తి , పవళింపుసేవ చేశారు . ఈ కార్యక్రమంలో మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు , కార్యదర్శి అర్వపల్లి నిరంజన్ , కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్రావు , పొట్టి ప్రసాద్ , కాకరపర్తి సూరి , భజన నాగేశ్వరరావు మరియు సాయినాధుని భక్తులు , సభ్యులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలలో విద్యార్థులకు సీట్లు పెంచి మిగిలిన సీట్లను వెంటనే భర్తీ చెయ్యాలి

**విద్యార్థుల భవిష్యత్ కు అనుగుణంగా సీట్లు భర్తీ చెయ్యాలి**

**టీ ఎస్ ఎస్ ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యం**



ఖమ్మం టౌన్, జూలై 16 ప్రజా జ్యోతి:గురుకుల కళాశాలలో విద్యార్థులకు సీట్లు పెంచి మిగిలిన సీట్లను వెంటనే భర్తీ చెయ్యాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు గురుకులాల్లో మిగిలిన సీట్ల కోసం ఆన్ లైన్ వెయిటింగ్ అంటూ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ సీట్ రాకపోగా వారికి వేరే చోట జాయిన్ అవకుండా క్లాసులు నష్టపోతున్నారు. కావున అధికారులు, గురుకులాల సెక్రటరీలు స్పందించి వెయిటింగ్ లో ఉన్న సీట్లను వెంటనే రిలీజ్ చేసి పేద విద్యార్థులకు కేటాయించి వారి భవిష్యత్తుకు మార్గం చూపెట్టాలని సత్యం తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు గొట్టె ముక్కల శ్రీనివాస్, వెంకట్, అర్జున్, రాము తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుల సమ్మె సైరన్



తిరుమలాయపాలెం, జూలై 16, ప్రజా జ్యోతి :మిషన్ భగీరథ వర్కర్లకి 4 నెలల నుంచి జీతాలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల జీతాలు చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని మంగళవారం మండలంలోని దమ్మాయిగూడెం గ్రామంలో సమ్మె బాట పట్టారు మిషన్ భగీరథ వర్కర్లు మాట్లాడుతూ జీతాలు రావట్లేదని జీతాలు పెండింగ్లో ఉండడంవల్ల మేము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ అధికారులను నిర్బంధించి, మా 4 నెలల జీతాలు ఎప్పుడు వేస్తారు వివరణ ఇవ్వాలని, మిషన్ భగీరథ వర్కర్లు ధర్నాకు తిరగడం జరిగింది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని మిషన్ భగీరథ వర్కర్లు కోరుకుంటున్నారు.

# అత్యద్భుతంగా స్వ"రూపమే" చెక్కుతారు..

**బొమ్మలు, విగ్రహాల తయారీకి ప్రసిద్ధి మంగాపురం కేంద్రం..**

**దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆర్డర్లపై సరఫరా..**

**తనికెళ్లలో 40 అడుగుల స్వరూపము ఎత్తులోనే ప్రథమం..**

**అనతికాలంలోనే పేరు, ప్రఖ్యాతలు పొందిన ఆంటోని రెడ్డి ఆర్ట్ స్టూడియో..**

ఖమ్మం ప్రతినిధి, జూలై 16 ప్రజా జ్యోతి: వారు స్వరూపము, విగ్రహము, బొమ్మలు తయారు చేస్తే శిల్పం చెక్కినట్లే ఉంటుంది. ఆధునిక టెక్నాలజీతో పాటు నవ, యువ తరంగా ఉండేవిధంగా నైపుణ్యత కలిగిన వారిచే బొమ్మలు తయారు చేయిస్తారు. వారుచేసిన బొమ్మలు అచ్చుగుద్దినట్లు రూపమే ఉంటున్నట్లుగా కనిపిస్తుంది. అంత అత్యాధునిక టెక్నాలజీ కలిగిన విగ్రహాల తయారీ కేంద్రం ఖమ్మంజిల్లా తల్లాడ మండలం మంగాపురం అడ్డరోడ్ లో ఆంటోని రెడ్డి ఆర్ట్ స్టూడియో పేరుతో బొమ్మల కంపెనీ ఏర్పాటు చేశారు.

**కథోలిక సాంప్రదాయ స్వరూపములు..** ప్రధానంగా కథోలిక సాంప్రదాయ స్వరూపములు చేస్తారు. 2 అడుగుల నుండి 80 అడుగుల వరకు అద్భుతమైన విగ్రహాలు చేయడం ప్రసిద్ధి. 14 స్థలములు, గ్రోటోలు, కల్వరి కొండలను బైబిల్ ఆధారంగా కట్టడములను నైపుణ్యం గల వారిచే అద్భుతంగా తయారుచేస్తారు.







**మహనీయుల, నాయకుల విగ్రహాలు సైతం..** దేశంలో ప్రసిద్ధిగాంచిన సంఘ సంస్కర్తల, మహనీయుల, రాజకీయ నాయకుల విగ్రహాలను తయారు చేయబడును. అదేవిధంగా ఇళ్లల్లో, ప్రధాన కూడళ్ళ పెట్టుకునే విధంగా ఫోటో ఇస్తే ఏ విగ్రహమైన అచ్చుగుద్దినట్లు చక్కదం వీరి నైపుణ్యత.

**తనికెళ్లలో 45 అడుగుల స్వరూపం వీరి ప్రతిభే..**ఖమ్మంజిల్లా కొనిజర్ల మండలంలోని తనికెళ్ళ ప్రధాన రహదారి పక్కన 40 అడుగుల యేసుక్రీస్తు స్వరూపాన్ని ఇక్కడ తయారుచేసినవే. దేశంలోనే ఈ స్వరూపం ప్రత్యేక ప్రాముఖ్యత గాంచినదిగా పేరు పొందింది.

**మూడు రకాలుగా బొమ్మలు తయారీ..** మూడు రకాల బొమ్మలను ఇక్కడ తయారు చేయడం జరుగుతుంది. సిమెంట్, ఫైబర్, ప్లాస్టర్ ఆఫ్ ది ప్యారిస్ తో బొమ్మలు తయారు చేయబడును.

**ఆర్డర్లపై వివిధ రాష్ట్రాలకు సరఫరా..**ఆర్డర్లపై దేశంలోని వివిధ రాష్ట్రాలకు విగ్రహాలను సరఫరా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 25 అడుగుల విగ్రహాలు గుంటూరు జిల్లా ఫిరంగిపురం, 10 అడుగుల విగ్రహాలు హైదరాబాద్ ఆర్డర్ ఉండటం వల్ల తయారుచేసి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

**నైపుణ్యత గల వర్కర్లు..**రాజమండ్రి, కేరళ రాష్ట్రాలకు చెందిన వర్కర్లచే విగ్రహాలు, స్వరూపములు తయారు చేస్తున్నారు. ఏ మోడల్ చేయాలన్నా అందంగా వచ్చే విధంగా చేయడం జరుగుతుంది.

**ఆర్డర్ చేస్తే వెంటనే పంపిస్తాం..**తయారీ నిర్వాహకులు బాసాని దిలీప్ రెడ్డి..ఏ రాష్ట్రానికి చెందిన వారైనా తమకు ఫలానా బొమ్మ కావాలని ఆర్డర్ చేస్తే వెంటనే పంపిణీ చేస్తామని తయారీ అధినేత న బాసాని దిలీప్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే పలు రాష్ట్రాలకు ఇక్కడ నుంచి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. బొమ్మను పట్టి రేట్లు ఉంటాయని, ఈ ప్రాంత పరిధిలోని వారందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విగ్రహాలు ఆర్డర్ కావలసినవారు సెల్ 92811 45557కు సంప్రదించగలరు.

## తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**విలేకరుల సమావేశంలో వినోభా నవోదయ కాలనీవాసులు**



ఖమ్మం అర్బన్, జూలై 16 ప్రజా జ్యోతి: వినోబా నవోదయ కాలనీ గ్రామ పేదలకు ఉన్న కోర్టు ఆర్డర్ లు, వారికున్న ఆధారాల ప్రకారం మంచినీరు , కరెంటు , రోడ్లు మొదలగు సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ని కోరుతూ అసత్యాలను ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వినోబా నవోదయ కాలనీ వాసులు స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోరారు. వెలుగుమట్ల గ్రామం వినోబా నవోదయ కాలనీలో గత ఏడేళ్లుగా భూదాన బోర్డు ఇచ్చిన 100గజాల స్థలంలో ప్రొసీడింగ్స్ ఆధారంగా ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేద కుటుంబాలవారు న్యాయమైన పోరాటం చేసుకుంటున్న క్రమంలో హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం మంచినీరు , కరెంట్ మొదలగు సౌకర్యాలు కల్పించుమని , వాటి ఆధారంగా స్థానిక కలెక్టర్ , రెవెన్యూ , మున్సిపాలిటీ , విద్యుత్ అధికారులను అనేక దఫాలుగా కలిసిన సహాయం అందకపోగా వందలాది కుటుంబాల ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతూ ఒక్కొక్క కుటుంబం నుండి కొంత కొంత డబ్బులు ఆర్థికసాయం కూడబెట్టుకొని కాలనీలోని పరిస్థితులను చక్కదిద్దుకొంటూ జీవన మరణ పోరాటం చేస్తున్న కాలనీవాసులకు అండగా ఉండాల్సిన సామాజిక బాధ్యత లేని ఒక అనధికార ఛానెల్ BMAP INDIA ( యూట్యూబ్ ఛానెల్ ) పేరుతో సమాచార హక్కు చట్ట ప్రచార వేదిక ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న కోయిన్ని వెంకన్న అనే వ్యక్తి వీడియోలో చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని , ఒక రియల్ ఎస్టేట్ వాళ్ళ అండతో , వినోభా నవోదయ కాలనీలో గౌరవంగా బ్రతుకుతున్న ప్రజలపై కుట్రపూరితంగా కావాలనే నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తున్నాడు అని ఆరోపించారు . వారి గౌరవమైన జీవనాన్ని అక్రమదారులు అని వెలకట్టి పేదల పరువును భంగం వాటిల్లేలా చేస్తున్నాడు . నిజమైన ఆధారాలు కావాలంటే ఏడేండ్లుగా చీకటిలో పిల్లాపాపలతో మగ్గుతూ బ్రతుకుతున్న మమ్మల్ని అడిగితే చెప్పేవాళ్ళం . కానీ ఎవరో చెప్పిన శత్రువుల మాటలు నమ్మి సామాన్య పేద కుటుంబాలపై ఈలాంటి సంఘటన చర్యలకు పాల్పడినాడు ఇదా ఒక భారతీయుడి వ్యక్తిత్వం . ఇదే ఛానెల్ వ్యక్తి గత 2 సంవత్సరాల క్రితం కాలనీ వచ్చి మీరు మంచి న్యాయమైన పోరాటం చేస్తున్నారు మీకు మా మద్దతు ఉంటుంది అని మాట్లాడిన వ్యక్తి ఈ రోజు కక్షపూరితంగా పోలీసులతో , రెవెన్యూ వారికి కూడా లంచమిచ్చి పేదలను వేల రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపణ చేశారు. ఒక ఛానెల్ నడిపే వ్యక్తి ఎటువంటి ఆధారాలు , అవగాహన లేకుండా విచక్షణ కోల్పోయి మాట్లాడారు . అలాగే సి.సి.ఎల్.ఏ భూదాన బోర్డు హైదరాబాద్ వారిని కూడా డబ్బులు ఆశ చూపారని ఇష్టం వచ్చినట్లు పిచ్చికూతలు కూసిన కోయిన్నీ వెంకన్న పై చట్టరీత్య చర్యలు తీసుకోని క్రిమినల్ చీటింగ్ కేసు నమోదు చేసి , వినోభా నవోదయ కాలనీ ప్రజలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ పడిగ యర్రయ్య , సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కల్తీ రామచంద్రయ్య , జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కుంజ కృష్ణయ్య , షేక్ అక్తర్ , పద్మ ,నాగమణి , బాసు , సత్యనారాయణ , వెంకటనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ మార్గదర్శకాలను సవరించాలి.

ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్



ఖమ్మం టౌన్, జూలై 16 ప్రజా జ్యోతి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు కోసం విడుదల చేసిన మార్గదర్శకాలు ఆర్థిక భారాన్ని తగ్గించుకునే ప్రయత్నంగా ఉందని వాటిని సవరించి షరతులు ఎత్తివేసి కటాఫ్ తేదీల మధ్య ఉన్న రుణాలన్నీ మాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి ఆచరణలోకి వచ్చేసరికి అందరికి రుణమాఫీ చెందకుండా షరతులు విధించడం సమంజసం కాదన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ కొందరికి చేసి కొందరికి ఎగనామం పెట్టడంతో రైతుల ఆగ్రహానికి గురైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ అందిస్తామని చెబుతూనే కుటుంబాన్ని నిర్ధారించడానికి ఆహార భద్రత కార్డు ప్రమాణికంగా తీసుకుంటామని రైతు రుణ ఖాతా ఆధార్, పానుపుస్తకం ఆధార్, రేషన్ కార్డు ఆధార్ లింక్ ఆధారంగా రుణమాఫీ అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రధాన మంత్రి కిసాన్ పథకం మినహాయింపులను పరిగణలోకి తీసుకోవాలని మార్గదర్శకాల్లో చెప్పడం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణమాఫీ ఎన్నికల వాగ్దానాన్ని తుంగలో తొక్కడమే అవుతుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు మాత్రమే ఇటువంటి షరతులు పెడుతుందని బాగం విమర్శించారు. కుటుంబం

నిర్ధారించుకోవడానికి రేషన్ కార్డు ప్రమాణికం అవసరం లేవని భార్య, భర్తలు, మైనర్ పిల్లలు కుటుంబంగా పరిగణిస్తారని గత రుణమాఫీ సమయంలో ఇదే పద్ధతిని అనుసరించారని ఇప్పుడు అదే పద్ధతిని అనుసరించవచ్చునన్నారు. రేషన్ కార్డు ప్రమాణికమైతే అనేక మందికి రేషన్ కార్డులు లేవని గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఉన్న కార్డుల్లో కూడా చాలా మందికి వివాహాలు జరిగి వేరే కుటుంబంగా మారారన్నారు. దీని వల్ల అనేక మంది రుణమాఫీకి దూరమవుతారని, పిఎం కిసాన్ మినహాయింపులు పరిగణలోకి తీసుకోవడమంటే రాష్ట్ర ప్రభుత్వానికి రుణమాఫీ అమలు పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులు ఉంటే కొద్దీ మంది రైతు కుటుంబాలకు మాత్రమే పిఎం కిసాన్ అందుతుందన్నారు. ఒక వైపు ప్రతి కుటుంబానికి రుణమాఫీని అందిస్తామని చెబుతూనే మరో వైపు ఇటువంటి షరతులు పెట్టి కోతలు పెడుతుందని విమర్శించారు. రీషెడ్యూల్ రుణాలకు మాఫీ వర్తించదని ప్రభుత్వం చెప్పడం భావ్యం కాదన్నారు. కరువు, వరదలు వచ్చినప్పుడు రుణాలు రీ షెడ్యూల్ చేసుకున్నారని గత ప్రభుత్వం కూడా రీ షెడ్యూల్ చేసుకున్న రైతులకు ఆన్యాయం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో వయనిస్తుందన్నారు. ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ చేయాలని కాలయాపన చేయకుండా తక్షణమే రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని బాగం తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ



తిరుమలాయపాలెం, జూలై 6, ప్రజా జ్యోతి : వర్షాకాల సమయంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ అన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత అవసరమని ప్రతి ఒక్క ఇంటి ఆవరణలో ఎలాంటి వర్షపు నీరు నిలువ లేకుండా నీటి కుళాయిలలో ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని వర్షపు నీరు నిల్వ ఉన్నట్లయితే వాటిలో దోమలు చేరి ఆ దోమలు కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు సోకుతాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జ్వరం వచ్చినట్లయితే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం జరుగుతుందని అన్నారు. మరి ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల చాలా జాగ్రత్త తీసుకోవాలని వారిని వర్షపు నీటిలో తడవకుండా చూడాలని వారి దుస్తులను ఎప్పటికప్పుడు మార్చాలని ఇంట్లో తాగునీరు గోరువెచ్చగా నీళ్లు వేడి చేసుకొని తాగాలన్నారు. ప్రజలు జ్వరం రాగానే నిర్లక్ష్యం చేసి తీవ్రతరం అయిన తర్వాత లక్షల రూపాయలు హాస్పిటల్లో ఖర్చు పెడతారని ముందు జాగ్రత్త పడితే త్వరగా నయం అవుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య రక్షణకై ప్రభుత్వ ఆసుపత్రులకు కోట్ల రూపాయలను మంజూరు చేసి ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించిందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.

## యన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మత్తు

సొంత ఖర్చులతో పని నిర్వహణ

అభినందనలు తెలిపిన రెండు గ్రామాల ప్రజలు





మధిర జూలై 16 ప్రజా జ్యోతి : మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు ఒకటో వార్డు నందు మండల కాంగ్రెస్ నాయకులు యన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా జిలుగుమాడు గ్రామం నుండి బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఇటీవల అస్తవ్యస్తంగా అండర్ డ్రైన్ బుంగ ఏర్పాటు చేయడంతో ఆ రహదారి గూండా ప్రయాణించడానికి రెండు గ్రామాల ప్రజలు మరియు వ్యవసాయదారులు కూలీలు అనేక ఇబ్బందులు పడ్డారు విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు యన్నం కోటేశ్వరరావు తన సొంత ఖర్చులతో జెసిబి తో రోడ్డు మరమ్మత్తు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు రాకపోకల సాగించేందుకు వీలుగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు దీంతోపాటు గ్రామంలో ఎప్పటినుండో పెండింగ్లో ఉన్న పలు రహదారి డ్రైనేజీ సమస్యలను పరిష్కరించారు ఈ సందర్భంగా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే స్పందించిన ఆయన పట్ల రెండు గ్రామాల ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆయన సేవ కార్యక్రమాల పట్ల పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు

## వంగవీడులో ఘనంగా శీతల భవాని పండగ



మధిర జులై16 ప్రజా జ్యోతి: మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో బంజారా లు శీతల భవాని పండుగ ఘనంగా జరుపుకున్నారుఈ శీతల భవాని పండుగ ప్రత్యేకత ఏమిటి అంటే ప్రపంచం వ్యాప్తంగా నివసిస్తున్న బంజారాలు వారి సంస్కృతి, సాంప్రదాయాలకు ఉత్పత్తికగా నిలిచే పండుగగా కోలుచుకోవడం జరుగుతుంది. ఇలాంటి పండుగ ప్రపంచంలో ఎక్కడా చూసినా మనకు కనిపించదు. ఈ పండగ బంజారాల యొక్క ఐక్యతను చాటి చెపుతుంది.పంట పొలాలు సాగు చేసే క్రమంలో తొలిసారిగా శీతల పండగ ప్రారంభమవుతుంది. హిందూ పండుగలో ఉగాది తొలి పండుగ ఎలా ఉందో. అలాగే శీతల భవాని పండుగ బంజారాల యొక్క మొదటి పండుగ. ఈ పండుగను వివిధ తండాలలో ఆ తండా ప్రజల పెద్ద మనుషులంతా కలిసి ఆషాడ మాసంలో ఒక మంగళవారం ఎంచుకొని పండుగను జరుపుతారు ఇలా ప్రతి సంవత్సరము కేవలం మంగళవారం రోజు మాత్రమే జరపటం ఈ పండుగ యొక్క ప్రత్యేకత మరియు ఆనవాయితీ లంబాడీల పండుగలలో మొదటిది ప్రధానమైనది దాటుడు, శీతల పండుగ తండాల సరిహద్దుల్లోని పొలిమేర కూడలి వద్ద శీతల భవాని ప్రతిష్టను ప్రతిష్టించి పురుషులంతా నంగారా వాయిద్యాలు వాయిస్తూ కోళ్లు ,మేకలతో. మహిళలు, యువతలు బోనాలతో ఆడుతూ, పాడుతూ ఈ పండుగను చాలా ఘనంగా జరుపుకుంటారు.లాప్సి పాయసం సమర్పిస్తారు కోళ్లు, మేకలను బలి ఇచ్చి వాటిని పైనుండి పశువులను దాటిస్తారు అలా చేయడం వల్ల పిల్లజల్లా ఆరోగ్యంగా ఉంటారని పాడిపంటలు బాగా పండుతాయి అని బంజారాల యొక్క నమ్మకం. దేవతను పూజించే క్రమంలో పెద్దమనిషిని పూజారిగా ఉంచి అతని చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించడం బంజారాల ఆచారం. ఎక్కువ పశువు సంపద వృద్ధి చెందాలని తండా ప్రజలందరినీ దేవత చల్లగా ఉండేలా దీవించాలని పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా ఉండాలని, ప్రజలకు కలరా, విష జ్వరాల బారిన పడకుండా ఉండటం కొరకు బంజారాలో అత్యంత నిష్టతతో కొలుచుకునే పండుగ శితుల భవాని పండుగ మంగళవారం సీతల భవాని పండుగను వంగవీడు తండా నాయక్ భూక్య హచ్య నాయక్, కరభారీ భద్రునాయక్, తులసా నాయక్, వస్త్రామ్ నాయక్, జంబు నాయక్ గోరియా నాయక్, సక్రు నాయక్, పకీర నాయక్ తదితర తండా వాసులు మొదలగు వారు పాల్గొన్నారు

## ముచ్చుమర్రి బాలిక కుటుంబానికి 10 లక్షల సాయం

**కర్నూలు** : నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో సామూహిక అత్యాచారానికి గురైన బాలిక మృతదేహం ఇంకా లభ్యంకాలేదు. ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలతో వారం రోజుల నుంచి వెతికినా చిన్నారి మృతదేహం దొరకలేదని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ముచ్చుమర్రి బాధిత బాలిక కుటుంబానికి ఏపీ ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించింది. బాధిత బాలిక కుటుంబానికి ఏపీ ప్రభుత్వం నుంచి రూ. 10 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని హోం మంత్రి అనిత తెలిపారు. విజయనగరంలో జరిగిన దారుణ ఘటనపై సైతం మంత్రి అనిత స్పందించారు. విజయనగరంలో ఊయలలో ఉన్న ఆరు నెలల పసికందుపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. తాగిన మైకంలో ఓ వృద్ధుడు నెలల పాపపై అత్యాచారం చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనలపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్షించారు. లిక్కర్, డ్రగ్స్ మీద ఉక్కుపాదం మోపాలని సీఎం చెప్పారని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు

# ఆదాయ పన్ను ఎగవేతదారులపై చర్యలు



ఖమ్మం టౌన్, జూలై 16 ప్రజా జ్యోతి: ఆదాయ పన్ను ఎగవేతదారులపై చర్యలుంటాయని ఖమ్మం ఆదాయపన్ను అధికారి ఉమామహేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీడీవో లకు ఆదాయపన్ను రిటర్న్ దాఖలుపై ఆదాయపన్ను అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయపన్ను అధికారి మాట్లాడుతూ, ప్రభుత్వానికి ఆదాయపన్ను ముఖ్య ఆదాయ వనరులని, ఆదాయపన్ను క్రింద వసూలయ్యే ప్రతి పైసా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కొరకు ఖర్చువుతుందన్నారు. త్రైమాసిక టీడీఎస్ దాఖలు తప్పనిసరి అని ఆయన అన్నారు. వేతన ఆదాయం కొరకు ఫారం 24క్యూ, వేతనేతర ఆదాయం కొరకు ఫారం 26క్యూ లో టీడీఎస్ లు సమర్పించాలన్నారు. డీడీవోలు క్రిడెన్షియల్ ను రహస్యంగా ఉంచాలని, ఎవ్వరికీ షేర్ చేయవద్దని ఆయన తెలిపారు. బోగస్ పత్రాలతో ఆదాయపన్ను ఎగవేతదారులపై ప్రాసిక్యూషన్ తో పాటు, పెనాల్టీ అధిక మొత్తంలో ఉంటుందని, కఠిన చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ఆదాయపన్ను రిటర్న్ ఫారం 16 ను జూన్ 15 లోగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీడీవోలకు ఆదాయపన్ను కు సంబంధించి రిటర్న్, త్రైమాసిక, వార్షిక రిటర్న్ ఎప్పుడు సమర్పించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఆదాయ పన్ను అధికారి చైతన్య, వివిధ శాఖల డీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏల హక్కులను కాపాడండి

**స్పీకర్‌ను కోరిన ఎంఎల్ఎ సబితా ఇంద్రారెడ్డి**

**హైదరాబాద్ :** అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కూడా ఓడిపోయిన వారికి మద్దతుగా నిలుస్తున్నారని, ఇదేనా ప్రజాపాలన అంటే కాంగ్రెస్ చెప్పాలని బిఆర్ఎస్ ఎంఎల్ఏ సబితా ఇంద్రారెడ్డి నిలదీశారు. బిఆర్ఎస్ ఎంఎల్ఏలు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కలిశారు. ఈ సందర్భంగా సబితా మాట్లాడారు. ప్రొటోకాల్ విషయంలో ఉల్లంఘనలను స్పీకర్ గడ్డ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గత ఆరు నెలల నుంచి ప్రతి నియోజకవర్గంలో ఓడిపోయిన ఎంఎల్ఏలకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఓడిపోయిన అభ్యర్థులు పాల్గొనడం ఏంటని ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. ఎంఎల్ఏల హక్కులను కాపాడాలని స్పీకర్‌ను కోరామని, ఎంఎల్ఏలకు ఉన్న హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందన్నారు.ప్రభుత్వ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఏ సునీతా లక్ష్మారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను ప్రత్యేక అతిథులగా పిలుచుకొని ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ ఎంఎల్ఏల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని లక్ష్మారెడ్డి తెలియజేశారు.

# బిజెపి లక్ష్యం భారత రాజ్యాంగాన్ని మార్చటం

**బిజెపిని ఓడించడమే సిపిఎం ప్రధాన లక్ష్యం**
**రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆశించిన స్థాయిలో లేదు**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**



మధిర జూలై 16 ప్రజా జ్యోతి : ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బిజెపి అత్యధిక ఎంపీ స్థానాలు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మార్చటమే లక్ష్యంగా పెట్టుకుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మధిర మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో శ్రీరస్తు ఫంక్షన్ హాలు నందు సిపిఎం జిల్లాస్థాయి ప్లీనరీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, బుక్య వీరభద్రం, పొన్నం వెంకటేశ్వరరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా తమ్మినేని వీరభద్రం పాల్గొని మాట్లాడారు. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని ఓడించడమే సిపిఎం ప్రధాన లక్ష్యం అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా సాంస్కృతిక, సామాజిక రంగంలో కూడా క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన ఆశించిన స్థాయిలో లేదన్నారు. పార్లమెంటు ఎన్నికలలో గతం కంటే కాంగ్రెస్ బలం పెరిగిందన్నారు. బిజెపి 370 ఎంపీ స్థానాలు లక్ష్యంతో బరిలోకి దిగిందని కానీ ఓడిపోయిందన్నారు. ఒకరకంగా బిజెపి పై ఇండియా కూటమి విజయం సాధించిందన్నారు. కేంద్రంలో బిజెపి బలం తగ్గినా పరిపాలనలో ఏమాత్రం తేడా ఉండదు అన్నారు. బిజెపి లౌకిక తత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. తెలంగాణలో ఓ మార్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్, బిజెపిల మధ్య ఘర్షణ గా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ బలం భారీగా తగ్గిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తులో బిజెపి మతోన్మాద ప్రమాదం పొంచి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని పెరగకుండా చేయటమే సిపిఎం రాష్ట్ర కమిటీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మతతత్వాన్ని రెచ్చగొట్టడం బిజెపికి తేలికగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనిస్టుల బలం పెరగవలసి ఉందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో గల ప్రాంతీయ పార్టీలు ఓడిపోగా ఇండియా కూటమిలో గల ప్రాంతీయ పార్టీల బలం పెరిగిందన్నారు. గతంలో బిజెపి ఉత్తర భారతదేశంలో బలంగా ఉండేదని కానీ ఇటీవల జరిగిన ఎన్నికలలో బాగా బలహీన పడిందని కానీ దక్షిణాది రాష్ట్రాలలో బలం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల రెండు లక్షల రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు పెడుతుందని విమర్శించారు. ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు ముందుగా ఎక్కువగా ఉన్న రుణాన్ని చెల్లించిన తర్వాత ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని చెప్పటం రైతులను మోసం చేయడమే అన్నారు. రుణమాఫీలో కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శించారు.అన్ని అన్ని వర్గాల ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తే మాత్రం సిపిఎం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అందుకు అనుగుణంగా సిపిఎం శ్రేణులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలను అంటిపెట్టుకొని పోరాటాల నిర్వహించాలన్నారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద రాజకీయాలు ప్రజలకు నష్టదాయకమన్నారు. రాష్ట్రంలో ప్రజాతంత్ర సంఘటనను నిర్మించవలసిన అవసరం ఉందన్నారు. ముందుగా వామపక్షాల ప్రజా సంఘాల ఐక్యవేదిక నిర్మించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ బలం తగ్గటంతో బిజెపి బలం పెరిగిందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎంతో ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో జరిగే అవకాశం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా రాజకీయ విశ్వాసం కలిగిన సిపిఎం అభ్యర్థులను పోటీలోకి దింపాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, మాచర్ల భారతి, బొంతు రాంబాబు, యనమదల విక్రమ్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పూర్తి కాలం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్లలో అడ్డగోలు దోపిడీ!

-మొదటి పేజీ తరువాయి

జారీ, పేరు, అడ్రస్, డేట్ ఆఫ్ బర్త్ మార్పిడితోపాటు బయోమెట్రిక్ అప్‌డేషన్ వంటి సేవలను పొందేందుకు ప్రజలు పెద్దఎత్తున ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల్లో ఈ-కేవైసీ ప్రక్రియను అమలు చేయడంతో కార్డులోని ప్రతి ఒక్కరికీ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడం తప్పనిసరైంది. దీంతో రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం తమ పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడానికి ఆధార్ కేంద్రాల బాట పడుతున్నారు. ఫలితంగా ఆధార్ సెంటర్లు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. దీన్ని అవకాశంగా మార్చుకున్న కేంద్రాల నిర్వాహకులు ప్రతి ఆధార్ కార్డుదారుడి వద్ద రూ.100 వసూలు చేస్తున్నారు. ఒక్క రేషన్ కార్డులో ఐదుగురు సభ్యులుంటే రూ.500 సమర్పించుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

**కేంద్రాలపై పర్యవేక్షణ నిల్..**

ఆధార్ కేంద్రాల దోపిడీపై దృష్టి సారించాల్సిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఫలితంగా ఆధార్ కేంద్రాల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఏదైనా అవసరం నిమిత్తం ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్చాలంటే ఇక వేలల్లో సమర్పించుకోవాల్సిదేనని ప్రజలు వాపోతున్నారు. పుట్టిన తేదీకి సంబంధించిన పత్రాలు లేకుంటే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకొని పని చక్కదిద్దుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలాలతో పోల్చితే ఖమ్మం నగరంలోని ఆధార్ సెంటర్ల దోపిడీ విపరీతమైనట్లు నగర ప్రజలు వాపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఆధార్‌లోని మార్పులు చేర్పుల కోసం కేంద్రాలకు రావడంతో నిర్వాహకుల పంట పండుతోంది. కేంద్రంలోని ప్రతి పనికీ రూ.100 చొప్పున అడుగుతుండడంతో ప్రజలు మారుమాట్లాడకుండా అడిగింది చేతిలో పెట్టి వెనుతిరుగుతున్నారు. రెవెన్యూ అధికారులు ఉండే జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మారుమూల ప్రాంతాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఖమ్మం నగరంలో ఆధార్ సెంటర్లపై అధికారులు దృష్టి సారించి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని వేడుకుంటున్నారు.

**'తెలంగాణ' అని మారిస్తే కూడా..**

దేశవ్యాప్తంగా ప్రజలందరికీ ఒకే గుర్తింపు కార్డు ఉండాలనే ఉద్దేశంతో అప్పటి కేంద్ర సర్కార్ ఆధార్ కార్డుల జారీని తీసుకొచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రక్రియ చేపట్టడంతో ప్రతి ఒక్కరి ఆధార్ కార్డులపై అడ్రస్‌లో రాష్ట్రం పేరు 'ఆంధ్రప్రదేశ్' అని వచ్చింది. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఆంధ్రప్రదేశ్‌ను కాస్త తెలంగాణగా మార్చుకోవడం రాష్ట్ర ప్రజలకు అనివార్యమైంది. తెలంగాణ అని మార్చుకోవడం కోసం కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్ కేంద్రాల బాట పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణగా మార్చినందుకు సైతం ఆధార్ సెంటర్ల నిర్వాహకులు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇందుకు ఇంటి ధ్రువీకరణ పత్రం ఉంటేనే చేస్తున్నారు. అయితే రాష్ట్రం పేరు తెలంగాణగా మార్పు చేసుకోవడం అందరికీ తప్పనిసరి కాబట్టి ఆధార్ కేంద్రాల్లో ఉచితంగా సేవలు అందించేలా చూడాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు. ఇదిలాఉంటే.. ఇంటర్‌నెట్ సెంటర్లలో సైతం ఆధార్‌లోని అడ్రస్ మార్చుకోవడం, గార్డియన్(తండ్రి, భర్త) పేరు మార్చుకోవడం వంటి కొన్ని సేవలు పొందవచ్చు.. ఈ విషయం తెలియక అనేక మంది ఆధార్ సెంటర్లకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు.

# కష్టపడితే పదవులు వాటంతట అవే వస్తాయి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ రాయలకు ఘనంగా సన్మానం

ఖమ్మం ప్రతినిది, జూలై 16 ప్రజా జ్యోతి: కష్ట పడితే పదవులు వాటంతట అవే వస్తాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు పదవీ బాధ్యతలు స్వీకరించి తొలిసారి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో డిసిసి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ...పార్టీ కోసం కష్ట పడే వారిని అధిష్టానం ఎప్పుడు గుర్తు పెట్టుకుంటుందని తెలిపారు.పాలేరు నియోజకవర్గంలో రాయల నాగేశ్వర్ రావు పార్టీ ని చెక్కు చెదరకుండా కాపాడుకుంటూ వచ్చారని, కార్యకర్తలకు అండగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలపై తనదైన రీతిలో అప్పటి పాలక పక్షంపై పోరాటం చేశారని గుర్తు చేశారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొంటూ పార్టీ




కట్టుబాటులను గౌరవిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని తెలియజేశారు. రాయల భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరి ంచాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు మాట్లాడ ుతూ...కష్ట పడే మనస్తత్వం ఉన్న వ్యక్తి రాయల నాగేశ్వర్ రావు అని అలాంటి వ్యక్తిని గుర్తించి కాంగ్రెస్ అధిష్టానం ప్రభుత్వంలో పదవి ఇవ్వడం శుభపరిణామం అని అన్నారు. మున్ముందు మరెన్నో పదవులు అలంకరిం చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కి కృతజ్ఞతలు తెలియజేశారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలను ఏకీభవిస్తూ, తనకు అప్పగించిన పదవిలో నిబద్ధతతో నడుచుకుంటూ అందరి మన్నలను పొందుతానని తెలిపారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజి ఎమ్మెల్సి పోట్ల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఎం డి జావేద్,నాగండ్ల దీపక్ చౌదరి,పి సి సి సభ్యులు వడ్డే నారాయణ, పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మహిళా ఐ ఎన్ టి యూ సి కిసాన్, సేవాదళ్, ఎస్సీ మైనారిటీ సెల్ అద్యక్షులు దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, మొక్కా శేఖర్ గౌడ్, గౌస్,బొడ్డు బొందయ్య,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, రాష్ట్ర కిసాన్, ఓబీసీ సెల్ ఉపాద్యక్షులు దాసరి దానియేలు, వడ్డేబోయిన నరసింహ రావు,కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్, నగర ఓబీసి సెల్ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, మందపల్లి నాగమణి, ఉన్నం రాజశేఖర్ వివిధ మండలాల అద్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఖమ్మం ప్రతినిది, జూలై 16 ప్రజా జ్యోతి: పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే మా ప్రభుత్వం లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంచుకున్న మొదటి ప్రాధాన్యత తెలంగాణ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల ప్రయోజనాలను అర్థం చేసుకొని పని చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎం, డిప్యూటీ సీఎం దిశా నిర్దేశం చేశారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ..కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యంప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మంది మహిళలు స్వయం సహాయక




సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరి సంఖ్యను కోటికి పెంచి.. వారందరినీ కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యంస్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 340 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 140 కోట్లు మొత్తంగా 480 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాము.. ఈ రుణాలకు వడ్డీ 1566 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. మహిళలకు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం అందిస్తుంది.. ఆర్థికంగా వారికి చేయూతనిస్తుంది.కొత్త విద్యుత్ పాలసీలో భాగంగా మహిళలను సోలార్ విద్యుత్ పైపు మళ్లించి ఆర్థికంగా ప్రోత్సహించాలని నిర్ణయించాము. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇప్పించి.. బ్యాటరీ బస్సులు కొనుగోలు చేయించి ఆర్థికంగా ప్రోత్సహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

# కమిషనరేట్‌లో యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు

**డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు**

**ఎన్‌ఫోర్స్‌మెంట్, డీ అడిక్షన్, ప్రి వెన్షన్ పైనా ప్రధాన దృష్టి**

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం** : డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సమాచార వ్యవస్థను మరింత భలోపేతం చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం నియంత్రణపై ఈ బృందాలు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. ప్రధానంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, డీ అడిక్షన్, ప్రి వెన్షన్ పైనా ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీస్ శాఖ యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి సమాచారం వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. మాధకద్రవ్యాల క్రయ విక్రయాల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం వాట్సప్ ద్వారా కాని సెల్ ఫోన్ ద్వారా ఫిర్యాదులు, సమాచారం అందజేసేందుకు అందుబాటులో వుండే యాంటీ డ్రగ్ కంట్రోల్ విభాగం 8712659123 సెల్ ఫోన్ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాచారం అందజేసిన వారి వివరాలకు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పల్లెల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘాతో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. అటు గంజాయి వాడుతున్న వారిని సైతం గుర్తించి వైద్య సదుపాయం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్ నుంచి రోడ్డు మార్గాల ద్వారా మత్తు పదార్థాలు రవాణా జరుగకుండా తనిఖీలు పటిష్ఠం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# అగ్ని బాధితులకు అండగా ఉంటాను బాధితులకు 10,000 ఆర్థిక సహాయం

**హుజురాబాద్** : హుజురా బాద్ అంబే ద్కర్ చౌరస్తాలో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో కాలిపోయిన చిరు వ్యాపారులకు అండగా ఉంటానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. మంగళ వారం అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. అగ్ని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, బీఆర్ఎస్ పార్టీ తరపున సంఘీభావం ప్రకటించారు. బాధితులు అధైర్య పడవద్దని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో ఆదుకుంటా మన్నారు. అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఆస్తి విలువను అంచనా వేయాల్సిందిగా అధికారులకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా చిరు వ్యాపారుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చిరు వ్యాపారుల దుకాణాలను పునర్నిర్మించడానికి తన వంతుగా వ్యక్తిగతంగా ఒక్కో బాధితునికి రూ.10,000 ఆర్థిక సాయం అందిస్తానన్నారు. అదేవిధంగా మూడు రోజుల్లోపు ప్రభుత్వం చొరవ తీసుకొని ఒక్కో షాపుకి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించాలని ఆయన అన్నారు. పునర్నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో తెలుసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సంఘటనకు సంబంధించి షార్ట్ సర్క్యూట్ జరిగిందా లేక ఇంకెవరైనా కావాలనే చేశారో తెలుసుకోవాలని పోలీసు అధికారులను విజ్ఞప్తి చేశారు. కాగా అగ్ని ప్రమాదంలో షాపులు కాలిపోయిన విషయం తెలియడంతో సంధ్యానే మహిళ స్పృహ తప్పి పడిపోయింది. విషయం తెలుసుకున్న ఆమెను ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పరామర్శించారు. అధైర్యపడవద్దని తప్పక అండగా ఉంటానని హామీ ఇచ్చారు.